కార్పొరేటర్ నుంచి ఎమ్మెల్యేగా..

కంటోన్మెంట్ ఎమ్మెల్యే రాజకీయ ప్రస్థానం



కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎర్రోళ్ల శ్రీనివాస్

కవాడిగూడ: ఐదుసార్లు వరుసగా కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న జి.సాయన్న కిడ్నీ సమస్యతో కొంత కాలంగా బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రిలో వైద్యం కోసం చేరారు. చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఎమ్మెల్యే సాయన్న పార్థివదేహాన్ని తన నివాసమైన గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లో సందర్శనార్థం ఉంచారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

1994లో తొలిసారి ఎమ్మెల్యేగా..

ఐదుసార్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగిన సాయన్న రాజకీయ జీవితం ప్రస్తుతం కవాడిగూడ డివిజన్‌గా కొనసాగుతున్న ఒకప్పటి దోమలగూడ డివిజన్ నుంచి ప్రారంభమైంది. 1986లో టీడీపీ నుంచి ఎన్టీఆర్ హయాంలో దోమలగూడ కార్పొరేటర్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతుల్లో ఓటమి పాలయ్యారు. అనంతరం 1994లో ఎన్‌టీఆర్ ప్రభుత్వంలో మొదటి సారిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండవ సారి 1999, మూడవ సారి 2004, బీఆర్‌ఎస్ నుంచి 2014, 2018 ఐదుసార్లు వరుసగా సాయన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగారు. వరుస విజయాలు సాధించిన జి.సాయన్న 2009లో ఓటమిపాలయ్యారు.

సాయన్న చొరవ.. నెరవేరిన 'సొంతింటి' కల!



సాయన్న భౌతికకాయం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

కంటోన్మెంట్/రసూల్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పేదలకు అందించడంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎనలేని కృషి చేశారు. కంటోన్మెంట్‌లో అత్యధికంగా పేదలు పది నుంచి ఇరవై గజాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటుండడంతో సాయన్న వారికి సొంత ఇంటి కలను నెరవేర్చారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న సాయన్న అటల్ బిహారి వాజ్‌పేయీ వాల్మీకి అవాస్ యోజన పథకం (వాంబే) ద్వారా రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీలో 555, తిరుమలగిరి ఎల్ ఐసీ కార్యాలయం సమీపంలో 336 మందికి ఇళ్లు మంజూరు చేయించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం 1365కు పైగా ఇళ్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం రసూల్‌పురాలో నారాయణ జోపిడి సంఘం వద్ద మరో 304 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. తమకు సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే సాయన్న హఠాన్మరణం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

బోర్డులో ఎటు చూసినా సాయన్న 'బోర్డు'లే!

కంటోన్మెంట్: మూడు దశాబ్దాలుగా కంటోన్మెంట్ రాజకీయాల్లో కీలక నేతగా కొనసాగిన సాయన్న 25 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు, మిలటరీ అధికారుల పర్యవేక్షణలో పాలన సాగే కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర పరిమితంగానే ఉంటుంది. అయినప్పటికీ సాయన్న ప్రతి కాలనీలోనూ తన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా పనులు చేశారు. దాదాపు 300 కాలనీలు, బస్తీల్లో సాయన్న తన ఎమ్మెల్యే నిధులతోనే బోర్లు వేయించారు. కంటోన్మెంట్ ఉన్న కమ్యూనిటీహాళ్లలో 90 శాతానికి పైగా సాయన్న హయాంలోనే నిర్మించినవే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.అందుకే కంటోన్మెంట్‌లో ఎక్కడికెళ్లినా సాయన్న నేమ్ ప్లేట్‌తో ఉన్న బోర్డులే దర్శమిస్తాయి.

సాయన్న మరణం తీరని లోటు..

లాలాపేట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణం బాధాకరమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. ఐదు పర్యాయాలు శాసన సభ్యుడిగా కంటోన్మెంట్ ప్రాంతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు.

'అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి'

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బర్కత్‌పురలో అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అపార్ట్‌మెంట్ దర్శన్ పేరుతో ఆదివారం బర్కత్‌పురలోని వివిధ అపార్ట్‌మెంట్ వాసులను ఎమ్మెల్యే కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్ వాసులు ఎవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలను మరింత మెరుగుపర్చేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, విద్యుత్ దీపాలు లాంటి సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన రామ గానలహరి

చిక్కడపల్లి: వర్ధమాన గాయకుడు సంపత్‌కుమార్ నిర్వహించిన రామ గానలహరి శ్రోతలను అలరించింది. సాయిలలిత మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో సంపత్‌కుమార్ ఆదివారం త్యాగరాయ గానసభలో ఉదయం 9గంటలకు మధురమే సుధారస గానం పాటను మధురంగా ఆలపించి 1950 నుంచి విడుదల అయిన తెలుగు సినిమాలలో ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, పీవీ శ్రీనివాస్, రామకృష్ణ పాడిన తన గళంలో నిర్విరామంగా 12 గంటల పాటు పాడి రాత్రి 9 గంటలకు విశేష ప్రేక్షక ప్రశంసలతో ముగించారు. కార్యక్రమంలో టీవీరావు, గొర్తి చంద్రశేఖర్, వినోద్‌బాబులు పాల్గొన్నారు.



సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాధవపెద్ది సురేష్ తదితరులు

హాత్ సే హాత్ జోడో యాత్రతో ప్రజల్లోకి కాంగ్రెస్



గోల్నాకలో హాత్ సే హాత్ జోడో యాత్రలో వీహెచ్, కాంగ్రెస్ శ్రేణులు

అంబర్‌పేట: హాత్ సే హాత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పాండిచెరి ఇన్‌ఛార్జ్ వి.హన్మంతరావు తెలిపారు. ఆదివారం గోల్నాక డివిజన్‌లో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పనిచేయాలన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



గోల్నాక డి మార్ట్ వద్ద జరిగిన శివాజీ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్



ముషీరాబాద్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గోల్నాక డీ మార్ట్ చౌరస్తాలో జరిగిన శివాజీ జయంతి వేడుకలకు కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ హాజరై శివాజీ చాటిచెప్పిన స్ఫూర్తిపై ప్రసంగించారు.

- బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలకు కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ బి.వెంకట్‌రెడ్డి, సెంట్రల్ ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి పాల్గొన్నారు.



కాచిగూడలో శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తున్న ఉమా రమేష్ యాదవ్

హిందూ ధర్మ సంస్థాపనే 'ఛత్రపతి' ఆశయం

కాచిగూడ: హిందూ ధర్మ సంస్థాపనకు ఛత్రపతి శివాజీ నిరంతరం శ్రమించారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకొని కాచిగూడ, నింబోలిఅడ్డలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. శ్రీమంత్, సుభాష్ పటేల్, భీరదర్, సోమేష్, సతీష్, పాల్గొన్నారు.

అనాథ బాలలకు చేయూతనివ్వండి

కాచిగూడ: అనాథ బాలలకు చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందని సేత్ గాన్సీరామ్ గోపికృష్ణ బద్రుక ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ శ్రీకిషన్ బద్రుక అన్నారు. కాచిగూడలోని సేత్ గాన్సీరామ్ గోపికృష్ణ బద్రుక ఎడ్యుకేషనల్ సొసైటీ (బద్రుక కాలేజ్) ఆధ్వర్యంలో ఆదివారం 1200 మంది ఆనాథ పిల్లలకు వివిధ క్రీడా సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అనంతరం శ్రీకిషన్ బద్రుక మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లల జీవితాల్లో వెలుగులు నింపి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో బద్రుక కళాశాల డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, పీజీ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, లెక్చరర్స్, సిబ్బంది, కళాశాల విద్యార్థులు, వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకిషన్ బద్రుక

తెలంగాణ కులగణన వివరాలు ఇవ్వండి

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



కాచిగూడ: తెలంగాణ కులగణన వివరాలకు ఇవ్వాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా కులగణన వివరాలను అందజేయడం వలన తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడం సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లు ఖచ్చితంగా నిర్ణయించుకోవడానికి ఎంతగానో కులగణన వివరాలు ఉపయోగపడతాయని అన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం: మంత్రి తలసాని



బ్యాటింగ్‌తో పోటీలను ప్రారంభిస్తున్న తలసాని

పద్మారావునగర్: క్రీడలు, మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతాయని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఓల్డ్ గాస్ మండి గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత సెల్‌ఫోన్‌కు ఇస్తున్న సమయం క్రీడలకు ఇవ్వడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. అంతకు ముందు మంత్రి కాసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వినాయక్, వినోద్, సుశీల్, వినయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన మేరకు.. ఉప్పుగూడ -ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని ఒంటిపైన స్కై బ్లూ కలర్ షర్టు, గ్రే కలర్ ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి



ముషీరాబాద్: బంజారా భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చి లిపి కల్పించి అధికార భాషగా గుర్తించాలని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేషచౌహాన్ అన్నారు. ఆదివారం ఢిల్లీ యూనివర్సిటీలో ఢిల్లీలోని బంజారా స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు హాజరయ్యారు. వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఢిల్లీలో జరగడం సంతోషంగా ఉందని కేంద్ర ప్రభుత్వం స్పందించి సెలవుదినంగా ప్రకటించాలన్నారు. అంతేకాకుండా దేశంలో ఉన్న బంజారాలను ఒకే జాబితాలో చేర్చాలని కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి: ఈనెల 14న జరిగిన హత్యకేసులో నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు.చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. చిక్కడపల్లి వివేక్‌నగర్ హనుమాన్ దేవాలయం సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉంటున్న శ్రీనును తలపై బండరాయితో మోది హత్య చేశారు.ఈ ఘటనలో నిందితుడు గుంటూరుకు చెందిన యానాల వెంకటేశ్వర్లు(40) ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన అనంతరం సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కదలికలను కనిపెట్టి అదుపులోకితీసుకున్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో 2సి ఆర్టీసీబస్సు ఎక్కిన నిందితుడు చార్మినార్‌వైపు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు తిరిగి తన స్వస్థలమైన గుంటూరుకు వె వెళ్లినట్లుగా గుర్తించారు. అయితే నిందితుడు నిన్న నగరానికి చేరుకుని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రివద్ద ఫుట్‌పాత్‌పై ఉండగా వలవేసి పట్టుకున్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ డీజీపీ అరవిందరావు

ఖైరతాబాద్: వనవాసి కల్యాణ పరిషత్ భాగ్యనగర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 1999 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఖైరతాబాద్ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ కె.అరవిందరావు, అఖిల భారత వనవాసి కల్యాణ ఆశ్రమం మార్గదర్శకులు సోమయాజులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విశాల సంస్కృతిని కాపాడేందుకు చేస్తున్న వనవాసి కార్యక్రమాలు చాలా బాగున్నాయని, పూర్వ విద్యార్థులంతా హింతుత్వ ఆలోచనా విధానం పెంచుకునే ప్రయత్నం చేయాలన్నారు. మన దేశం చుట్టూ ఉన్న భూటాన్, నేపాల్, బర్మా వంటి సరిహద్దు ప్రాంతాల్లో వనవాసులు చాలా ముంది ఉన్నారని, వారంతా మన దేశ సంస్కృతి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు, విద్యా, వైద్యంపై దృష్టి సారించామని సోమయాజులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి తిరుపతిరెడ్డి, వనవాసి తెలంగాణ ఇన్‌చార్జి గాయత్రి శోభనాచలపతి, సుధీర్, మురళి, 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు షురూ



రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి మార్చి5వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లాస్థాయిలో జరిగే కార్డినల్ పూలా అంథోని ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. రెవరెండ్ ఫాదర్ డాక్టర్ వీకే.స్వామి, రెవరెండ్ ఫాదర్ రాజు అలెక్స్, అకాడమీ చైర్మన్ పి. లూయిస్ అరుళ్‌రాజ్, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమూల్‌రాజ్ ముఖ్య అతిథులుగా హాజరై జెర్సీలను ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. 16 జట్లు పాల్గొనగా మొదటి మ్యాచ్ హిరోస్ క్లబ్, హైదరాబాద్ గ్లోబ్ జట్ల మధ్య జరగగా హైదరాబాద్ గ్లోబ్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో టీసీబీసీ సెక్రటరి రెవరెండ్ ఫాదర్ సాగయ్యరాజ, చైర్మన్ ఎడ్వర్డ్ జక్రాయిస్, పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

సికింద్రాబాద్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతాఫల్‌మండి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు, ఈఓ జీ.శ్రీనివాసుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవానికి కార్పొరేటర్ సామల హేమ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు మురళీధరశర్మ, రంగం వేణుగోపాలా చార్యులు, రఘునందన్, సుధాకర్, మల్లేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో..

సనత్‌నగర్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ తరుపున కార్పొరేటర్ కొలను లక్ష్మీ, బాల్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి వారికి అభిషేకం, అర్చన, సామూహిక పూజలను జరిపారు. సామూహిక రుద్రాభిషేకం, శివపార్వతుల ఊయల సేవ తదితర కార్యక్రమాలను కొనసాగించారు.

'రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అన్యాయం చేస్తోంది'

లిబర్టీ: తెలంగాణలో దళిత సీఎంను నియమించాలని డిమాండ్ చేస్తూ మార్చి 11న దళిత గర్జన సదస్సును హైదరాబాద్ మహానగరంలో నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరు కృష్ణస్వరూప్ తెలిపారు. దళిత సీఎం సాధన కోసం రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించి తెలంగాణ ప్రభుత్వంపై సీఎం కేసీఆర్‌పై ఒత్తిడి తెస్తామన్నారు. ఆదివారం దళిత బహుజన పార్టీ కార్యాలయంలో పార్టీ పదాధికారుల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు నూతన సీఎంగా దళితులను చేస్తామని కేసిఆర్ ప్రకటించి దళిత జాతిని నమ్మించి మోసం చేశారని, దళితుల అభివృద్ధి నిధి డబ్బును వేల కోట్ల రూపాయలు ఇతర పథకాలకు దారి మళ్లించి దళితుల ఆర్థిక అభ్యున్నతి సంక్షేమాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొన్ని వర్గాలు మాత్రమే లాభపడ్డాయని, దళితులు ఏమాత్రం లాభపడలేదన్నారు. అంబేడ్కర్ సారథ్యంలో రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు మత శక్తులు కుట్రలు చేస్తున్నాయని, మన సంస్కృతిని తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను దళితులు ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దేవుని శ్రీనివాస్, ఎం.కిరణ్, సి.సుబ్బారావు, బీరం సతీష్ కుమార్, రాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మహిళలకు కరాటేలో ఉచిత శిక్షణ

కాచిగూడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు కాచిగూడలోని అకాడమిలో మహిళలకు ఉచితంగా కరాటేలో మెలకువలు నేర్పించడం జరుగుతుందని అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9494112424.

రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో ప్రహర్షితకు గోల్డ్ మెడల్



కాచిగూడ: కోహినూర్ సీఎం కప్ ఇంటర్నేషనల్ రిథమిక్ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్ షిప్ -2023లో కాచిగూడ ప్రాంతానికి చెందిన కుమారి ప్రహర్షిత గోల్డ్‌మెడల్ అందుకుంది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కోహినూర్ సీఎం కప్ పోటీల్లో అద్భుత ప్రతిభను కనబర్చి గోల్డ్‌మెడల్‌ను సాధించింది. గోల్డ్‌మెడల్ సాధించిన ప్రహర్షితను ఈ సందర్భంగా ఆదివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అభినందించి సత్కరించారు.

పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా



అంబర్‌పేట: రోడ్డు పనులు చేస్తుండగా తాగునీటి పైప్‌లైన్ ధ్వంసమైంది. ఆదివారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో పైప్‌లైన్ పగలడంతో తాగునీరు ఎగిసిపడడంతో వృథా అయ్యింది. సమాచారం అందుకున్న జలమండలి అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి పైప్‌లైన్ మరమ్మతులు పనులు చేపట్టారు.

అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తిని శిక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా అనుచిత వాఖ్యలు చేసిన మతోన్మాది హమర ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ బహదూర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ బహదూర్ మాట్లాడుతూ.. మహోన్నతమైన వ్యక్తిని కించపరచడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు సుదర్శన్, రాజు, భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో అంబర్‌పేట విద్యార్థులు

అంబర్‌పేట: ఏపీజే అబ్దుల్ కలాం శాట్‌లైట్ లాంచ్ వెహికిల్ మిషన్ 2023 కార్యక్రమానికి అంబర్‌పేట మండల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఆదివారం తమిళనాడులో జరిగిన కార్యక్రమానికి అంబర్‌పేట మండల్ మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరై అక్కడి సాంకేతిక అంశాలను పరిశీలించారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయురాళ్లు లత, భాగ్యలక్ష్మీ, వనజలు హాజరైనట్లు డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మీ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

సికింద్రాబాద్: చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 15న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఇంజినీరింగ్ లోయర్ యార్డు వద్ద ఆగిఉన్న రైలు బోగీలో సుమారు 60 సంవత్సరాల వయసున్న వృద్ధులు అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. మూడ్రుజులు చికిత్స పొందిన వృద్ధురాలు ఆదివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతురాలి ఎడమచేతిపై పచ్చబొట్టుతో ముగ్గు, పసుపు రంగు చీర, గులాబీ రంగు జాకెట్ ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

అనారోగ్యంతో యాచకుడి మృతి

నల్లకుంట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యాచకుడు ఫుట్ పాత్‌పై మృతి చెందాడు. ఈ ఘటన నల్లకుంట పోలీసులు స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్సై రమాదేవి తెలిపిన మేరకు..ముతరాసి శంకర్(45) అనే యాచకుడు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఫుట్ పాత్‌పై విగత జీవిగా పడి ఉన్నాడు. సమాచారమందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవ పంచనామ చేసి మృత దేహాన్ని గాంధీ మార్చురీకీ తరలించారు.